విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

ఉపాధ్యాయులకు జడ్పీటిసి పోతురాజు బాలయ్య సూచన

విశాలాంధ్ర-చింతపల్లి : విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అది ప్రాథమిక విద్య దశ నుంచే పాటిస్తే బాగుంటుందని జడ్పీటిసి పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ లోనీ ప్రభుత్వ పాఠశాలను పెద బరడ సర్పంచ్ సమిడ గోపాల్ తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్యను అందించినట్లయితే పై తరగతుల్లో మంచిగా రాణిస్తారనీ, అప్పుడే వారి భవిష్యత్ కు ఉపాధ్యాయులు మంచి బాటలు వేసిన వారౌతారన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని కోరారు. పాఠశాలను, విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం సిబ్బందితో మాట్లాడి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, విధ్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఉల్లి లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపిపి బూసరి కృష్ణారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌ను గౌరవించండి

ఎన్డీయే కూటమి పార్టీల నాయకులకు ఎంపీపీ అనూష దేవి హితవు

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ సమయంలో ఎన్డీయే కూటమి పార్టీల నాయకులు ప్రోటో కాల్‌ను గౌరవించాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. తన ఛాంబర్‌లో గురువారం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మండలంలో ఆకూటమి పార్టీల హడావిడి ఎక్కువ అయ్యిందన్నారు. ప్రజా ప్రతినిధులు చేయవలసిన అనేక కార్యక్రమాలలో వారి ప్రమేయం లేకుండా కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులపై కూటమి పార్టీల నాయకులు ఒత్తిడి తెస్తున్నారని, ఈ సంస్కృతి మంచిది కాదన్నారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా ప్రజల చేత ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు ఏ పార్టీకి చెందిన వారైనా ప్రోటోకాల్ ప్రకారం వారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వవలసిన బాధ్యత అటు అధికారుల పైనా, ఇటు ఎన్డీయే కూటమి పార్టీల నాయకులపై ఉందన్నారు. కానీ ఎన్డీయే కూటమి పార్టీలకు చెందిన కొంతమంది నాయకులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ కార్యక్రమాల లోనూ తమకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రజా ప్రతినిధులు హాజరు కాక ముందే కార్యక్రమాల నిర్వహణ పూర్తి చేసిన సందర్భాలు లేకపోలేదన్నారు. ఇటువంటి సంస్కృతి గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వాల పెద్దలు, ఆప్రభుత్వాలలో విధులు నిర్వహిస్తున్న అన్నిశాఖల ఉన్నతాధికారులు ప్రోటోకాల్ నిర్వహణపై అటు కూటమి పార్టీల నాయకులకు, ఇటు అన్నిశాఖల ఉద్యోగులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ప్రజా ప్రతినిధులు గౌరవానికి భంగం కలుగకుండా చూడాలని ఆమె కోరారు.

గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : గ్రంథాలయ వారోత్సవాల భాగంగా స్థానిక గ్రంథాలయంలో నాలుగో రోజు ఆదివారం విద్యార్థినులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కేజీబీవీ, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. చదువుతోపాటు డ్రాయింగ్‌లో కూడా విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని గ్రంథాలయ అధికారిని విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బందికే సుబ్బారావు పాల్గొన్నారు.

బోట్లలో లభ్యమైన మద్యం ధ్వంసం

విశాలాంధ్ర - దేవీపట్నం : మండలంలో పోశమ్మ గండి బోట్ పాయింట్ నుంచి పాపికొండల పర్యాటకానికి వెళ్లే బోట్లలో తనిఖీల్లో లభించిన మద్యం బోటళ్లను దేవీపట్నం స్టేషన్ ఎస్సై ఎస్ కె షరీఫ్ ఆదివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పాపికొండల పర్యాటకం కు వెళ్లే పర్యాటకులు మద్యం తీసుకు రావటం చట్టరీత్యా నేరం అని మరోసారి ఇలా జరిగితే బోట్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లభించిన మద్యంను ధ్వంసం చేశారు.

నాటుసారా, మద్యం గొలుసు దుకాణాలను నియంత్రిస్తాం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కూర్మారావు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యంలో నాటు సారా, మద్యం గొలుసు దుకాణాలను నియంత్రిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జే కూర్మా రావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో ఎక్కడైనా మద్యం గొలుసు దుకాణాలు, నాటు సారా, నల్ల బెల్లం, అమోనియా క్రయ విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారంలోనే తమ సిబ్బందితో రైడ్ చేసి రెండు మద్యం గొలుసు దుకాణాలలో 56 మద్య సీసాలు పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామని, నాటు సారాకి ఉపయోగించే నల్లబెల్లపు పులుపు 1600 లీటర్లు ధ్వంసం చేశామని, ఉన్నతాధికారలు ఆదేశాలు మేరకు మద్యం గొలుసు దుకాణాల వారికి లైసెన్స్ ఉన్న మద్యం షాపుల నుండి మద్యం సరఫరా చేసే వారిపై కేసులు తప్పవని, ఎవరైతే గొలుసు దుకాణాలకు లైసెన్స్ దుకాణదారులు మద్యం సీసాలు సరఫరా చేస్తున్నారో వారికి మొదటిసారిగా ఐదు లక్షల రూపాయలు జరిమానా విధించి, మరోసారి దొరికితే లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. నాటు సారా బట్టీలకు మైదాన ప్రాంతాల నుండి జోరుగా నల్లబెల్లం, అమ్మోనియా సరఫరా చేస్తున్నారని సమాచారం ఉందని, వారిని కూడా పట్టుకుని కేసు నమోదు చేస్తామని, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో పూర్తిగా మద్యం గొలుసు దుకాణాలు, నాటు సారా దుకాణాలను నిర్మూలిస్తామని, లైసెన్స్‌లు ఉన్న మద్యం దుకాణాలలో మద్యం సీసాలు ఎమ్మార్పీ ధరకే అమ్మాలని ,ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేస్తే సహించింది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిన్న, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రాంతంలో మాతృభూమి సేవలు మరింత విస్తృతం

సారావానిపాలెంలో 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు
50 మందికి ఉచిత కంటి వైద్యం

విశాలాంధ్ర-అనంతగిరి : గిరిజన ప్రాంతంలో మాతృభూమి సేవా సంఘం సేవలు ఎనలేనివని చెప్పవచ్చు. పాఠశాల విద్యార్థుల నుంచి మొదలుకొని విగ్రహాల దాతలు, ఉచిత వైద్యం వైద్యం అందించే వరకు చేస్తున్న సేవలు చిరస్మరణీయమైనవి. అందులో భాగంగా ఆదివారం అనంతగిరి మండలంలోని కాశీపట్నం పంచాయతీ శారవానిపాలెం గ్రామంలో మాతృభూమి సేవ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం నుంచి కాస్వి హాస్పిటల్ మరియు శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర లోక్సత్తా అధ్యక్షులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాతృ భూమి సేవ సంస్థ కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులు సంగం కరకవలస నగేష్ కాస్వి హాస్పిటల్ వైద్యురాలు మీసాల అనూష, జి జయవెన్నెల తో కలిసి గిరిజనులకు బిపి, షుగర్, జ్వరం జలుబు దగ్గు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా వైద్యం చేస్తూ మందులు అందజేసి ఆరోగ్యానికి తగు సలహాలు సూచించారు వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించితగు సూచనలు చేశారు..అనంతరం ముఖ్యఅతిథి బాబ్జి ఇతర స్వచ్ఛంద సంస్థల సభ్యుల చేతుల మీదుగా 100 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతృభూమి సేవ సంస్థ కార్యదర్శి ఉప్పలవలస గోపి మాట్లాడుతూ ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతంలో ఉన్న నిరు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఈ మెగా మెడికల్ క్యాంపును నిర్వహించడం చాలా ఆనందదాయకమని 'మానవసేవే మాధవసేవ' అంటూ... ఇవే కాకుండా పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, వృద్ధులకు రగ్గులు పంపిణీ వంటి మంచి మంచి కార్యక్రమాలు గిరిజన ప్రాంతంలో మరింత విస్తృతం చేస్తామని ఆయనతెలిపారు కార్యక్రమంలో కస్వీ హాస్పిటల్ నుంచి సాయికిరణ్ నర్సింగ్,చందన నర్సింగ్, అభిషేక్ మార్కెటింగ్ మేనేజర్,కంటి ఆసుపత్రి నుంచి రాజు, కల్పన, కావ్య, ఎం.తిరుపతిరావు కలం ఫౌండేషన్, మన జనం స్వచ్ఛంద సంస్థ స్థానికులు మోహనరావు ఎంపీటీసీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర ఇంచార్జి జాన్ వెస్లీ

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఏ.పీ.ఆర్. పాఠశాలలు, కళాశాలలు, కస్తూర్బా స్కూల్స్ లలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి అనడానికి మేరక చింత హాస్టల్ నిదర్శనంగా నిలిచిందని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర ఇంచార్జి జాన్ వెస్లీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక హాస్టల్ లోనే 1000 కేజీల బియ్యం బయటకి చేరిందంటే వందలాది హాస్టల్స్‌లో ఉన్న నిత్యావసరాల సరుకులు ఎంత మొత్తంలో దోపిడీ చేయబడుతున్నాయో అర్థమవుతుందన్నారు. గిరిజన ప్రభుత్వ హాస్టల్స్ సమస్యల నిలయాలుగా నేడు గిరిజన ప్రాంతం లో ఉన్నాయన్నారు. సక్రమంగా మెనూ అమలు చేయకుండా విద్యార్థుల పొట్ట కొడుతున్నారని ఆయన మండి పడ్డారు.ఒకవైపు ప్రభుత్వం మెస్ బిల్లులు పెంచకుండా జైల్లో ఉండే ఖైదీ కంటే హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులకు మెస్ చార్జీలు తక్కువ ఇస్తున్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో సగుటు విద్యార్థికి మెనూకి సరిపడా నిత్యావసర సరుకులు తీసుకోవడంలోనే చాలా కష్టమైన పరిస్థితులు ఉంటే దీనిలోనే వార్డెన్లు దోపిడీ చేయడం చాలా దారుణమని అన్నారు. వార్డెన్లకే కాకుండా పై స్థాయి అధికారులకు కూడా ఈదోపిడీలో భాగస్వామ్యం ఉంటుందని కాబట్టే అంత ధైర్యంగా విద్యార్థుల నిత్యావసర సరుకులు దోపిడీకి గురవుతున్నాయని ఆయన ఆరోపించారు. మెరక చింత హాస్టల్ లో రెండు ఆటోల బియ్యం దొడ్డి దారిన తరలించారని గ్రామస్తులు తెలుపుతున్నప్పటికీ ఒక్క ఆటో మాత్రమే మాకు పట్టుబడిందని దానిలో 1000 కేజీలు వరకు బియ్యం ఉందని హుక్కుంపేట మండల స్థాయి గిరిజన విద్య శాఖ అధికారి అనడం చాలా దారుణమని అన్నారు. ఇలా జరిగిన తప్పులను కప్పిపుచ్చుకుంటూ అవినీతి అధికారులను కాపాడేటందుకు సస్పెండ్ చేశామని చర్యలు తీసుకున్నామని తెలుపుతున్నారు. మరొక ఆరు నెలల్లో మళ్లీ తన విధుల్లో చేరి మళ్లీ హాస్టల్స్‌లో దోపిడీ చేయటానికి, వాటాలు పంచుకోవడానికి పై స్థాయి అధికారులు చేసే ఎత్తుగడగా భావించాల్సి వస్తుంది. అవినీతికి పాల్పడ్డ అధికారిపై సస్పెండ్ వేటు కాకుండా ఉద్యోగం నుండి తొలగించే డిస్మిస్ అనే చర్యలు తీసుకునే పద్ధతిలో అధికారులు చర్యలు తీసుకుంటే బావుంటుందని అన్నారు. మరోకసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేలా అవినీతికి పాల్పడితే కఠినమైన చర్యలు ఉంటాయి అని భావన కలగాలని అన్నారు. హుకుంపేట మండలంలో జరిగిన ఘటనపై ఏటిడబ్ల్యూ స్పందన చూస్తే ఆ అవినీతి వార్డెన్ ను,హెడ్మెస్టర్ ని కాపాడేటట్లు ఆమె మాటలు ఉన్నాయని భావించాల్సి వస్తుంది. ఇటువంటి ఏటిడబ్ల్యూకి డిడి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పజెప్పడంతో జిల్లాలో ఉన్న అన్ని హాస్టల్స్ దోపిడీకి గురి కాకుండా ఉంటాయా అని అనుమానించాల్సి వస్తుంది. ఇప్పటికైనా వార్డెన్స్ దగ్గర నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు విద్యార్థుల మెనూ అమలుపరిచే విధంగా పోషక పదార్థాలు అందించి వాళ్ళ ఆరోగ్యానికి అండగా నిలిచేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. తక్షణమే విజిలెన్స్ మరియు పౌర సరఫరా అధికారులతో కూడిన కమిటీ నియమించి జిల్లాలో ఉన్న ప్రతి హాస్టల్స్ లలో నిత్యావసర సరుకులపై మరియు ఇతర అంశాలపై పర్యవేక్షణ చేసి అవినీతికి పాల్పడి ఉన్నట్లయితే ఆ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాస్థాయి అధికారులు నిర్లక్ష్య వైఖరిన కనబరిస్తే ఖచ్చితంగా విద్యార్థులు మమేకం చేసుకొని పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.

కెచ్చలరాంరెడ్డి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని కల్లునూరు గ్రామానికి చెందిన కెచ్చేల రామ్ రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కుటుంబానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ ఐదువేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఇబ్బందులు పడుతున్న రామిరెడ్డి కుటుంబానికి జమాల్ ఖాన్ సహాయంగా 5000 రూపాయలు అందించడం పట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా చింత రేఖపల్లి గ్రామంలో త్రాగునీటితో సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు జమాల్ ఖాన్ కు సమస్య చెప్పడంతో తక్షణమే చేతిపంపును ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ ఆర్థికంగా, మౌలిక సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అందరూ సంతోషంగా ఉండాలని అందులో మనం ఉండాలని అప్పుడే జీవితానికి అర్థం పరమార్థం చేకూర్తాయని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, గ్రామ పెద్దలు సరఫరాజ్ అలీ, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు రియాజ్, సూఫీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ

విశాలాంధ్ర-సాలూరు : సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా గేదెల.రామకృష్ణ ను నియమించినట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య తెలిపారు. శనివారం పట్టణంలో వెలమపేట శ్రీ సీతారామ కళ్యాణమండపంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంఛార్జ్ గేదెల రామకృష్ణ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీ కాంక్షనాయుడు పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు.అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ ఇంఛార్జ్‌గా నిమయమించిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. నియోజకవర్గం ప్రజలతో బంధుత్వం పాటు విశేషపరిచయాలు ఉన్నాయన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న నియోజకవర్గం సాలూరు అన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సాలూరు ప్రజల మన్ననలు పొందేందుకు అహర్నిశలు పని చేయడంతోపాటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పునర్వైభవం తీసుకు రావడానికి కృషిచేస్తానన్నారు. త్వరలోనే నియోజకవర్గం అంతటా పర్యటించి గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సాలూరు నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించేందుకు సహకరించిన మన్యం జిల్లా డిసిసి అధ్యక్షులు సటక బుల్లిబాబు, పార్వతీపురం ఇంఛార్జ్ బత్తిన మోహనరావు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంఛార్జ్ గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రీసు రాము, అక్కాన అప్పారావు, దాసరి భాస్కరరావు, ఎర్ర గోవింద, సబ్బారపు వెంకటరావు, చిన్నారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా ర్యాంకింగ్ చెస్ పోటీలు

24 మందికి బహుమతులు అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీ చెస్ కోచింగ్ సెంటర్ యాజమాన్యం నిర్వహించిన ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఘనంగా జరిగింది. ఆరు విభాగాలు ఉండగా పార్వతీపురం మన్యంజిల్లా వ్యాప్తంగా అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన ఈ పోటీలో 24 మంది బహుమతులను గెలుచుకున్నారు. వీరందరినీ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నామని నిర్వాహకులు ప్రకటించారు. ఈకార్యక్రమాన్ని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు డా.మంచిపల్లి శ్రీరాములు ప్రారంభించగా, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు ప్రారంభో పన్యాసం చేశారు. మండల ఉపవిద్యాశాఖ అధికారి కె. ప్రసాదరావు పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతోపాటు క్రమశిక్షణ, విలువలను పిల్లలందరూ నేర్చుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ చిన్నప్పటినుండి పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకొని చదువులో రాణించాలని, సమాజం గర్వించే భావి పౌరులుగా ఎదగాలని ఆశీర్వదించారు. ప్రారంభోపన్యాసం చేసిన కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు సమయపాలన పాటించాలని, జీవితంలో ఎదగాలంటే చదువుతోపాటు ఆటలను కూడా నేర్చుకొని మనోవికాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెంచుకోవాలని సూచించారు. చదరంగం వంటి ఆటలు ఆడటం వలన తెలివితేటలు పెరుగుతాయని, ఏకాగ్రత పెంపొందుతుందని తద్వారా చదువులో మంచి ఫలితాలు సాధించవచ్చని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సంస్కృత పండితులు మరియు వ్యాఖ్యాత కవిరత్నజె.బి. తిరుమలాచార్యులు స్వాగతోపన్యాసంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో 11 పాఠశాలల నుండి 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవంలో డా.మంచిపల్లి శ్రీరాములు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు, సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోర్జ హేమ సుందరరావునాయుడు, సాలూరు సాహితీ మిత్రబృందం అధ్యక్షుడు చావలి శేషాద్రి సోమయాజులు కార్యదర్శి ఆకుల గణపతి, పూర్వ కార్యదర్శి గొట్టాపు శ్రీనివాసరావు, ఛీఫ్ ఆర్బిటర్ వి. వెంకటేష్, ఆర్బిటర్ మంచిపల్లి గోపీనాథ్,ఆర్బిటర్ భార్గవి విజయనగరం నుండి విచ్చేసిన ప్రత్యేక ఆర్బిటర్ బైరెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. అండర్-8 బాలికలో వి.చైత్రేశ్వరి (ప్రథమబహుమతి), శరణ్య(ద్వితీయ బహుమతి) సాధించారు. అండర్-10 బాలురలో ఈ.యశ్వంత్ కుమార్, పి.హర్షలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. అండర్-10 బాలికల్లో వి.చిరుమానస, కే.లిఖితలు ప్రథమ, ద్వితీయ బహుమతిలు సాధించారు. అండర్ -12 బాలికల్లో కే.తేజస్విని, టి.నందలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. అండర్- 12 బాలురల్లో వి.ధనుంజయరాజు, విద్యాసాగర్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. అండర్-14 బాలికలో నాగజ్యోతి, ఎస్.సాయిసంజనలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. అండర్-14 బాలురల్లో ఎం.నరేష్‌దేవి హిమనేత్రలు ప్రథమ, ద్వితీయ బహుమతిలు సాధించారు. అండర్-16 బాలురల్లో కె.పార్థు, ఎండి షాహిద్, శ్రీకర్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు. అండర్-16 బాలికల్లో పి.దేదీప్య ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు.

నవంబర్ 26న జరిగే మహాధర్నాపై సమన్వయ సమావేశం

విశాలాంధ్ర-బెలగాం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నవంబర్ 26వ తేదీన జరిగే మహాధర్నాను విజయవంతం చేయడం గూర్చి ఆదివారం వివిధ ప్రజాసంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నవంబరు 26వ తేదీన పార్వతీపురం పాత బస్టాండ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని కలెక్టర్ అందచేయాలని, అలాగే ఈనెల 24వ తేదీ ఉదయం 10 గం.లకు పాలకొండ నుండి మెయిన్ రోడ్డు గుండా సీతానగరం వరకు బైకు ర్యాలీ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమాలను కార్మిక, కర్షక, గిరిజన, ప్రజాసంఘాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్.కె.ఎం జిల్లా కన్వీనర్ బంటు దాసు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి. శ్రీమనాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి వై. మన్మథ రావు, ఆయర్ల సంఘం జిల్లా నాయకులు పి. సంగం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, చెరువుల పరిరక్షణ కమిటీ నాయకులు వి. దాలినాయుడు, గిరిజన సంఘం నాయకులు పి. రంజిత్ కుమార్, కార్మిక సంఘం నాయకులు టి. జీవన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి. సూరయ్య, సిఐటియు నాయకులు బి. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మజ్జివీధిలో భారీ అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-మక్కువ : మక్కువ మజ్జి వీధిలో ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కొవ్వాడ నాగరాజు పెంకుటిల్లు విద్యుత్ షార్ట్ కట్‌తో ఒక్కసారిగా పొగలు కమ్ముకొని మంటలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. పొలం పనులు నిమిత్తం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లిపోయారు. చుట్టుపక్కలవారు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఇంట్లో రిఫ్రిజిరేటర్, గ్యాస్ ఒక్కసారిగా పేలడంతో బీరువా, ఇంటి సామాగ్రి ఇంట్లో సర్టిఫికెట్స్, అదేవిధంగా నగదు 3,50,000, బంగారం ఆరు తులాలు బూడిదిపాలయింది. స్థానిక ఎస్సై ఎం.వెంకటరమణ రెవెన్యూ సిబ్బంది విఆర్ఓ కాసిరాజు ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు. అదేవిధంగా ఫైర్ సిబ్బంది వచ్చి ఇంటిని పరిశీలించారు. బాధితులు కట్టుబట్టలు తప్ప మిగిలినవన్నీ కూడా బూడిద పాలు కావడంతో బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని న్యాయం చేయగలరని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సుమారు 15 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని రెవిన్యూ సిబ్బంది తెలియజేశారు.

స్వచ్ఛ సుందరంగా పార్వతీపురంను తీర్చిదిద్దాలి : కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : స్వచ్ఛ సుందరంగా పార్వతీపురంను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంపై ఆదివారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతకు మారు పేరుగా పార్వతీపురం నిలవాలని పేర్కొన్నారు.ఎక్కడ చూసిన పరిశుభ్ర వాతావరణంతో ఆహ్లాదకారంగా కనిపించాలన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి, చెత్త నుంచి సంపదను సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే జట్టు ఆశ్రమం చర్యలు చేపట్టిందని, అదేవిధంగా మరిన్ని సంస్థలు ముందుకువచ్చేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. చెత్తను శుభ్రం చేయడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటా యన్నారు. వీటితో పాటు రహదారులు, పార్కులు, విద్యుత్, ట్రాఫిక్ తదితర రంగాలను అభివృద్ధి చేయాల్సి ఉందని అన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చి గుంతలు లేని రహదారులకు చర్యలు చేపట్టామన్నారు. పట్టణంలోని ఒక్కో కూడలిని దత్తత తీసుకొని సామాజిక బాధ్యతతో సర్వ సుందరంగా తీర్చిదిద్దేలా వాణిజ్యవేత్తలు, ఇతర వర్గాలను కోరినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో చక్కని కళా ప్రతిమలు ఏర్పాటు చేయుటకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆచార్యులతో చర్చించామని తెలిపారు. ఆహ్లాదకర వాతావరణానికి, పరిశుభ్రతకు నిలయంగా మారాలని ఆయన అన్నారు. చుట్టూ పచ్చదనం కనిపించేలా మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని అన్నారు. పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నా మని, ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వాహనాల కోసం పార్కింగ్, సిగ్నల్ లైట్ల వ్యవస్థను ఏర్పాట్లు చేయబోతున్నట్లు కలెక్టర్ వివరించారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, వివిధ అసోసియేషన్లు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్స్‌ను తొలగించి దారి చూపరూ...

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖ ద్వారం నుండి మండల కేంద్రమైన జియ్యమ్మ వలసకు నిత్యం వాహనాల రద్దీగా తిరిగే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు డొంకలు ప్రమాద స్థాయిలో ఉన్నాయి. అంతే కాకుండా మలుపుల వద్ద దారి కూడా కనిపించని దుస్థితి. ఈ క్రమంలో ఎప్పుడు ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి. రహదారిలో ఇంత ఎక్కువగా జంగిల్స్ ఉండటం భయం భయంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఎటువైపు నుండి ఏ వాహనం వస్తుందోనని భయపడి ప్రయాణం చేయాల్సి వస్తోందని దీనిపై అధికారులు స్పందించి తక్షణమే తుప్పలు డొంకలను తొలగించాలని వాహన చోదకులు పాదాచారులు డిమాండ్ చేస్తున్నారు.

పిజిఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారిగా రామగోపాల్

విశాలాంధ్ర - పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) జిల్లా నోడల్ అధికారిగా సెట్విజ్ సీఈవో బి రామ్ గోపాల్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు ప్రత్యేక గుర్తింపు ఉన్న నేపథ్యంలో పిజిఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారిగా బి.రామగోపాల్‌ను నియమించడం జరిగింది. నమ్మకంతో తనకు ఈబాధ్యతను అప్పగించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ నోడల్ అధికారి విధులు సక్రమంగా నిర్వర్తిస్తానని రామ గోపాల్ తెలిపారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని సుభద్రసీతారాంపురం గ్రామంలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేయగా అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకొని ఆమెవద్దనుండి 14మద్యం సీసాలను స్వాధీనపరచుకోవడం జరిగిందని ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి తెలిపారు.సీతానగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అక్రమ మద్యం అమ్మకాలు మరియు నాటు సారాయి విక్రయాలు జరిగినచో మరియు ప్రైవేట్ మద్యం షాపుల్లో ఎం ఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు విక్రయించినచొ 944090 2373 నెంబర్ కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. మూడు మండలాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

సరిహద్దు ప్రాంతంలో పిక్నిక్ సందడి

విశాలాంధ్ర-పాచిపెంట : పాచిపెంట ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో గల పి.కోనవలస సమీపములో గల మామిడి తోటలో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మరియు విశ్వబ్రాహ్మణుల సంఘం వేరువేరుగా పిక్నికల్ నిర్వహించారు. చిన్నపిల్లలు పిక్నిక్ ఆధ్యాంతం కేరింతలతో సందడిగా మారింది. ఈ పిక్నిక్ సందర్భంగా దూర ప్రాంతాలలో ఉన్న బంధువులకు సమాచారం అందించడంతో మొదటి నుంచి చివర వరకు సందడిగా నేలకు0ది .దూర ప్రాంతాల నుండి బంధువులు రాకతో ప్రాంగణమంతా సందడి నెలకొంది చిన్న పిల్లల ఆటల పాటలతో మరింత సందడి నెలకొంది అలాగే విశ్వ బ్రాహ్మణ సంఘం పిక్నిక్ ను సందడిగా నిర్వహించారు.

బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నికలను తిరస్కరించాలి

విశాలాంధ్ర-బెలగాం : దేశంలో నరేంద్రమోడీ బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నికలను తిరస్కారమవ్వాలని దీనివల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే పెను ప్రమాదం ఉందని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో పాకల సన్యాసిరావు, రెడ్డి శ్రీదేవి, పి.రాజశేఖర్ అధ్యక్షతన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.మన్మధరావు పర్యవేక్షకులుగా పార్వతీపురం పట్టణ ఆరవ మహాసభ నిర్వహించారు. మొదటగా మహాసభ ప్రారంభ సూచికగా సిపిఎం పార్టీ జెండాను పట్టణ సీనియర్ నాయకులు బంకూరు సూరిబాబు ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధుల సభలో ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య, రాష్ట్ర నాయకులు ఎం. సత్యనారాయణ మరియు విజయవాడ వరద బాధితులలో ఇతర ఇతర ప్రమాదాలలో మరణించిన అమరులకు పి. రాజశేఖర్ సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ జమిలీ ఎన్నికలు వల్ల ప్రజలు ప్రశ్నించే హక్కుని కోల్పోతారని, మాట్లాడే హక్కు ఉండదని ప్రజలు ఓటు వేసే హక్కులు లేకుండా పోతాయని, ఒకే దేశం ఒకే ఎన్నిక వలన డబ్బున్నవాళ్లే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి ఉంటుందని రాష్ట్రాల హక్కుల కోల్పోయే ప్రమాదం ఉందని వాపోయారు. దేశంలో రోజు రోజుకి నిరుద్యోగం పెరిగిపోతుందని ప్రజాసమస్యలు గాలికి వదిలేసి ప్రభుత్వరంగ సంస్థలన్ని ప్రైవేటు కార్పొరేట్ వాళ్లకి అప్పచెప్పేపనిలో ఉన్నారని ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. వై. మన్మధరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బిజెపికి తగిన మెజార్టీ ఇవ్వలేదని, ఎన్డీఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడినా గత ఆర్థిక విధానాలనే దూకుడుగా అమలు చేస్తున్నదని అన్నారు. ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయకుండా ఎపికి బిజెపి ద్రోహం చేస్తున్నదని, రాష్ట్రంలో వైసిపిని ఓడించి అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం కూటమి ఇచ్చిన హామీలు అమలుకు పూనుకోలేదని ఉచిత ఇసుక అమలు కావడంలేదని, ప్రజలపై విద్యుత్ భారాలు మోపారని సిపిఎస్ రద్దుపై వెనుకడుగు వేస్తున్నదని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టడాన్ని గతంలో వ్యతిరేకించి ఇప్పుడు అమలుకు పూనుకోవడాన్ని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం వివక్షత చూపుతున్నదని రాజధాని నిర్మాణానికి గ్రాంట్ ఇవ్వకుండా అప్పుతో సర్దుకోమంటుండడం అన్యాయమని దీన్ని రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ ప్రవేశపెట్టిన నిర్మాణ కార్యకలాపాల నివేదికను ప్రతినిధులందరూ ఆమోదించారు. అనంతరం పట్టణ నూతన కమిటీ సభ్యులుగా ఎనిమిది మందిని మహాసభ ప్రతినిధులు ఎన్నుకున్నారు. పాకల సన్యాసిరావు, రెడ్డి శ్రీదేవి, ఎస్. ఉమా, పి. రాజశేఖర్, కె. భగత్, బి. లక్ష్మి, ఎం. వెంకటరమణ, ఆహ్వానితులుగా బి. సూరిబాబుతో పాటు నూతన పట్టణ కమిటీ కార్యదర్శిగా గొర్రి వెంకటరమణను ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంచినీరు, పారిశుధ్య నిర్వహణ, రోడ్లు, కాలువలు, స్మశానవాటిక, విద్యుత్ సరఫరా కోతలు వంటి సామాజిక మరియు సంక్షేమ సమస్యలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాలని బి. సూరిబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని జి. తులసి బలపరుస్తూ సభ్యులందరూ ఆమోదం తెలిపారు. డిసెంబర్ 10, 11 తేదీలలో కురుపాంలో జరిగే జిల్లా పదవ సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలని గొర్లి వెంకటరమణ పిలుపునిచ్చారు.

నారా రామ్మూర్తినాయుడు మృతి తెదేపాకు తీరని లోటు

విశాలాంధ్ర-చింతపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆపార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మండలం కార్యనిర్వాహక కార్యదర్శి ఆంద్రాబు లక్ష్మణ్, బూత్ ఇంచార్జ్ కేశవ, గొందిపాకలు యూనిట్ ఇంచార్జ్ యస్వంత్‌లతో కలిసి గొందిపాకల గ్రామంలో ఆదివారం దివంగత రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు మృతి ఆయన కుటుంబానికే గాక పార్టీకి తీరనిలోటన్నారు. సంతాపం ప్రకటించిన వారిలో ఆ పార్టీ నాయకులు హరి, మోహన్, ఐటిడిపి మండల ఇంచార్జ్ మహేంద్ర ఉన్నారు.

చింతూరు : నారా చంద్రబాబునాయుడు గారి సోదరరుడు, చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారా రాముర్తినాయుడు అకాల మరణం చెందటం జరిగింది. చింతూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామ్మూర్తినాయుడు ఫోటోకి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మరణం పట్ల నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు అకోజు నూకాచారి, ఉపాధ్యక్షుడు వాస శ్రీరామ్ రెడ్డి, ప్రచార కార్యదర్శి కట్ట శంకర్, ఐటీడీపీ శ్యామల వినోద్‌కుమార్, బూత్ ఇంచార్జీ సోయం రవికుమార్,ఆసీఫ్ సయ్యద్,ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం : మండలంలోని రేఖ పల్లి తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో కీ.శే. నారా రామమూర్తి నాయుడుకు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు ఆయన చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బురక కన్నా రావు, నియోజక వర్గ మహిళ కార్యదర్శి సోడే వెంకమ్మ, నియోజక వర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాశరావు, పాయం సుబ్బారావు, నలారపు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి గిరిజన ముద్దుబిడ్డ భగవాన్ బిర్సా ముండా ఆశయాలను సాధిద్దాం

- ఘనంగా బిర్సా ముండా 150వ జయంతి
- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు రామకృష్ణ

విశాలాంధ్ర-చింతపల్లి : జార్కండ్ జాతిరత్నం, స్వాతంత్ర సమరయోధుడు, ఆదివాసి గిరిజన ముద్దుబిడ్డ భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను గ్రామ గ్రామాన, ఇంటింటా గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో భాగంగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ ఆధ్వర్యంలోను బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార?ండ్ జాతి రత్నమైన భగవాన్ బిర్సా ముండా 19వ శతాబ్ద బ్రిటిష్ కాలంలో బీహార్, జార?ండ్ అటవీ ప్రాంతంలో జరిగిన స్వాతంత్ర్య ఉద్యమానికి సారథ్యం వహించి బ్రిటిష్ వలసవాదులపై తిరుగుబాటు చేశారన్నారు. ఆదివాసి హక్కులలో భాగంగా అడవులు, భూమి, నీరు పరిరక్షణ కొరకు ఉద్యమించారన్నారు. బ్రిటీష్ పాలకులు ఆదివాసి సమాజాన్ని అణగదొక్కాలని ప్రయత్నించి నప్పటికీ ఆ ప్రయత్నానికి వ్యతి రేకంగా బ్రిటిష్ పాలకులపై తిరుగు బాటు చేసిన దీశాలి అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆదివాసి గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడు కోవడంతోపాటు, ఆయన ఆశయా లను సాధించవలసిన ఆవశ్యకత ప్రతి గిరిజనునిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు శెట్టి రామకృష్ణ, వంజరి శ్రీనివాస్, టీచర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మోహన్ రావు, ఆదివాసి జెఏసి మండల సభ్యులు చిన్నారావు, ఉపాధ్యాయురాలు లోత సత్యానంద లక్ష్మి, పూజారి నారాయణ మూర్తి, వనబంగి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

చినబొండపల్లిలో టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-పార్వతీపురం : మండలంలోని చినబొండవల్లి గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల పార్టీ అధ్యక్షులు బోను చంద్రమౌళి తెలిపారు. ఎంఎల్ఏ బోనెల విజయచంద్ర ఆదేశాలను అనుసరించి చినబొండపల్లిలో ఆదివారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంకు అను ఈ స్పందన లభించిందన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని అన్ని గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు చురుగ్గా చేస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు బోను చంద్రమౌళి, గౌరజాన చంద్రమౌళిలు తెలిపారు. టిడివి నాయకులు కార్యకర్తలు అభిమానులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని నమోదు చేసుకుంటన్నట్లు తెలిపారు.

ఏపీ మంత్రులను కలిసిన తెలుగు యువత నాయకులు

విశాలాంధ్ర-ఎటపాక : ఏపీ మంత్రులను ఎటపాక తెలుగు యువత నాయకులు శనివారం కలిసినారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులను డోల వీరాంజనేయ స్వామివారిని కలిసి ఏజెన్సీలో గిరిజనులకు మాత్రమే గృహాలు కేటాయిస్తున్నారని, అలాగే గిరిజన ఇతరులకు కూడా గృహాలు కేటాయించాలని కోరారు. వెంటనే స్పందించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కలిసి ఎటపాక మండల కేంద్రంలో త్రీఫేస్ లైన్ కావాలని కోరారు. వెంటనే వారు స్పందించి పాడేరు ఎస్సీతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి పోలవరం సమస్యల గురించి భూ ప్యాకేజీ, ఆర్ అండ్ఆర్ ప్యాకేజి ఇప్పించాలని, ఎటపాక నుండి కన్నాయిగూడెంకు ఐదు కిలోమీటర్ల పరిధిలో కరకట్ట మంజూరు చేయాలని కోరినారు. దీనికి మంత్రులు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు నలజాల శ్రీకాంత్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్, ఎటపాక మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు పాటి సంపత్‌కుమార్, ఎటపాక మండల ఐటీడీపీ చాంపియన్ బాచినేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు వేగవంతంగా పూర్తి చేయండి

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతంగా పూర్తిచేయాలని మండలటీడీపిపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడులు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆదేశాలు, సూచనల మేరకు నియోజకవర్గంలో చురుగ్గా కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. మండలంలో కూడా పోటీగా నిర్వహించి నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు జరిగేలా చూడాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముందుకు వచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కేజీబీవీ ఉపాధ్యాయినికి పురస్కారం

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : స్థానిక కస్తుర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న కె.క్రిష్ణకుమారి ఉత్తమ ఉపాధ్యాయనిగా పురస్కారాన్ని తీసుకున్నారు. హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియం, భాస్కర ఆడిటోరియంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు అల్లూరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక చేసి పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాదులోని ఆమె ఆదివారం శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ పటన్నం కమల మనోహర్ చేతుల మీదుగా పురస్కారాన్ని తీసుకున్నారు. ఇటీవల న్యూఢిల్లీలో జాతీయ సేవారత్న అవార్డును పొందిన ఆమె ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారాన్ని పొందడంపై ఆ పాఠశాల యాజమాన్యం అభినందించారు.

29

19న సీతానగరంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని శ్రీసువర్ణ ముకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం శివపార్వతుల కళ్యాణంను ఘనంగా నిర్వహించడం జరుగు తుందని ఆలయ అర్చకులు అయ్యలూరి మల్లేశ్వరరావు, అయ్యలూరి అవధానిలు తెలిపారు. ఈ కళ్యాణంలో మండలంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. దినకర కోటి ప్రభాకర లింగంఅంటే శివునికి కోటి సూర్యులశక్తి ఉంటుందని, ఈకళ్యాణంలో పాల్గొని ఆ పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహం భక్తులు పొందాలని తెలిపారు. కళ్యాణంసందర్భంగా పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమాన్ని కూడా నిర్వ హించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపే వారికి హెచ్చరిక : ఎస్సై శ్రీనివాసరావు

విశాలాంధ్ర-అనంతగిరి : మండల పరిధిలో వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదనే అనంతగిరి ఎస్సై శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారంనాడు మండల పరిధిలో కాశీపట్నం గ్రామం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ముఖ్యంగా వైకుంట గిరి వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించే వెంకటేశ్వర ఆలయానికి పంపించారు. ముఖ్యంగా మద్యం సేవించిన వారి పై దృష్టి సారించామని మద్యం సేవించి వాహనం నడపరాదని తనిఖీల్లో దొరికితే జైలు శిక్ష తప్పదని తెలిపారు. అదేవిధంగా కాశీపట్నం ప్రధాన రహదారికి ఇరువైపులా, వైకుంత రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసిన దుకాణదారులు రహదారికి అనుకొనీ పెట్టరాదని రహదారికే ఐదు మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రేపటికల్లా దుకాణదారులు కచ్చితంగా ఈ విషయం పాటించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ మధ్యకాలంలో వాహనాల రద్దీ పెరిగిందని వచ్చే వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై తెలిపారు.

బొర్రాలో పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధికి చర్యలు

పారిశుధ్య మెరుగుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు : ఎంపీపీ శెట్టి నీలవేణి

విశాలాంధ్ర-అనంతగిరి : ప్రముఖ పర్యటక కేంద్రమైన బొర్రా గుహలు పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ స్థలాల అభివృద్ధికి మండల పరిషత్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ శెట్టి నీలవేణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొర్రా పరిసర ప్రాంతాల్లో మూడు స్థలాలను తహసీల్దార్ గుర్తించి వాటిని పార్కింగ్ స్థలాలుగా వినియోగించాలని సూచించారు. ఎంపీడీఓ ఏ.వి.వి.కుమార్‌తో కలిసి ఆప్రాంతాలను స్వయంగా పరిశీలించామన్నారు. ఈ మేరకు ఆ స్థలాలను చదును చేసి వాహనాలు పార్కింగ్కు అనువుగా తయారు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా బొర్రాతో పాటు బొర్రా జంక్షన్, అనంతగిరి వంటి పర్యాటక ప్రాంతాల్లో టోల్ ప్లాజా నిధులతో డస్ట్ బిన్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు ఇప్పటికే డస్ట్ బిన్‌లను ఆయా ప్రాంతాలకు సరఫరా చేసినట్లు తెలిపారు. పార్కింగ్ టోల్ పై వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేయవద్దని ఆమెతో పలికారు.

హైందవ శంఖారావ సభకు తరలిరావాలి

విశాలాంధ్ర-గంగవరం : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన నిర్వహించే హైందవ శంఖారావ సభకు ఏజెన్సీ మండలాలలో హిందూ ధార్మిక సంఘాలు అయినా ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ సమరసత సేవ, వనవాసి కళ్యాణ ఆశ్రమం చలో విజయవాడ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్య సభ్యులు భావనారాయణ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా పాత గంగవరం రామాలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ శంఖారావం ముఖ్య ఉద్దేశం... హిందూ దేవాలయాలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాలని, అనే ఉద్దేశంతో శంఖారావం పూరించడం జరిగిందని దీనిని ప్రతి ఒక్క హిందువు విధిగా శంఖారావ కార్యక్రమానికి స్వచ్ఛందంగా పాల్గొని ఆయన కోరారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రంపచోడవరం జిల్లా విశేష సంపర్క ప్రముఖ వై.ప్రసాద్, సూర్యచంద్ర, వనవాసి కళ్యాణ ఆశ్రమం సభ్యులు ఎం.శ్రీనివాస్, భారతి, బిజెపి నాయకులు కుంజం వెంకటేశ్వర్లు దొర, రామాలయ కమిటీ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడి మృతికి సంతాపం

విశాలాంధ్ర-గంగవరం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు మాజీ శాసనసభ్యులు నారా రామూర్తినాయుడు అకాల మరణానికి చింతూస్తూ తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షులు పాము అర్జున్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో తెలుగు దేశం మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి దుమ్ముల భానుప్రకాష్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి పామర్తి వీరబాబు, మండల తెలుగు దేశం ఎస్టీ సెల్ అధ్యక్షులు సింహాద్రీ రాంబాబు, మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు కొమ్మన చిన్నారావు, బూత్ ఇంచార్జి దుమ్ముల రాంబాబు, మొల్లేరు గ్రామ అధ్యక్షులు బలిజ రాంబాబు, మద్దిటి వీరభద్ర రావు,శారపు సత్యవేణి,గుత్త శ్రీ రామ్, సాగర్, కలవపల్లి చంటి పాల్గొన్నారు.

బిసికాలనీలో చురుగ్గా జరుగుతున్న శ్రీఆంజనేయ స్వామి ఆలయపనులు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని చెల్లంనాయుడువలస గ్రామంలోని బీసీ కాలనీలో శ్రీఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎండోమెంట్ సహకారంతోపాటు స్థానిక గ్రామ మాజీ ఎంపిటిసి దాసరి నాగరత్నం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి త్రినాథ్ సహకారంతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. స్లాబ్ వరకు పనులు జరిగాయని వారు తెలిపారు. వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మృతిచెందిన ఉపాధ్యాయ కుటుంబాన్ని యుటిఎఫ్ సభ్యులు పరామర్శ

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలంలో ఉపాధ్యాయుడిగా గతంలో పని చేసిన గంగవరం గ్రామానికి చెందిన వీరవత్తుల ప్రతాప్ రంపచోడవరం మండలం గొట్లగూడెం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఈనెల 13వ తేదీన బూరుపూడి వద్ద యాక్సిడెంట్‌కి గురై రాజమండ్రి బొల్లినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మారేడుమిల్లి మండల యుటిఎఫ్ సభ్యులు ఆదివారం ఆయన స్వగృహానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు యుటిఎఫ్ సభ్యులు విద్యాశాఖ అధికారి వై మల్లేశ్వరావు చేతులు మీదుగా 40వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు కే కృష్ణారెడ్డి, కే ఆంద్రయ, సహాయ అధ్యక్షులు ఎం.సాయిబాబా, వి.అబ్బాస్, సాల్మన్‌రాజు, అధ్యక్షులు వై.విల్సన్‌బాబు, ఐటిడిఏ సబ్ కమిటీ కోకన్వీనర్ కే.సూరిబాబు, రంపచోడవరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ సనాతనబాబు, ఎన్ వెంగళరావు పాల్గొన్నారు.

19న గురమంద విశ్వనాథస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

విశాలాంధ్ర-వై.రామవరం : ఈనెల 19న మండలంలో అటవీప్రాంతంలో ఉన్న గురమంద విశ్వనాథస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, రుద్రహెూమం పూజలు నిర్వహిస్తున్నట్లు గుడి కమిటి నిర్వాహకులు పల్లాల వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ పూజలలో పాల్గొనే భక్తులు, దంపతులు చీర, జాకెట్టు, పంచి, కండువా ధరించాలని, పూజా సామాగ్రి తెచ్చుకోవాలని, పూజకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. వేద పండితులు పళ్ళావఝల రామకృష్ణ శర్మ పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

మన్య ప్రాంతానికి వన్నెతెచ్చిన వలిసె పూలు

పర్యాటకులను ఆకట్టుకుంటున్న పసుపు పూల సోయగం
వలిసె చేలలో ఫోటోలు, వీడియోలు తీసుకునేందుకు పోటీ పడుతున్న పర్యాటక ప్రియులు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలో విస్తారంగా సాగయ్యే వలిసె చేలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శీతల వాతావరణానికి తోడు వలిసె చేలలో విరబూసిన పసుపు వర్ణ శోభితమైన వలిసె పూలు పర్యాటక ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీకెండ్‌లో శని, ఆదివారాలలో ఆంధ్ర కశ్మీర్‌గా పేరొందిన లంబసింగి, తాజంగి, చెరువుల వేనం వ్యూ పాయింట్ తదితర ప్రదేశాలతో పాటు తాజంగి జలాశయం వద్ద ఏర్పాటుచేసిన జిప్ లైన్, బోట్ షికార్, దట్టంగా పరుచుకునే మంచు పరదా, మన్యంలో విస్తారంగా సాగయ్యే కాఫీ పూల పరిమళాలు, వలిసె పూల అందాలు పర్యాటకులను మైమరిపింప చేసే సుందర దృశ్యాలు. ఇటువంటి దృశ్యాలను ఆస్వాదించేందుకు పర్యాటక ప్రియులు ఆంధ్ర కశ్మీర్‌కు క్యూ కడుతున్నారు. గతంలో లేని సౌకర్యాలను అటు అధికారులు, ఇటు స్థానికులు ప్రస్తుతం కల్పిస్తున్నందున పర్యాటకులు అధికసంఖ్యలో వచ్చేందుకు ఈ ప్రాంత అందాలను ఆస్వాదించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. ఈ క్రమంలో వలిసె చేలలో ఫోటోలు తీసుకునేందుకు పర్యాటక పోటీపడుతున్నారు.

గుచ్చిమిలో ఆర్యవైశ్యుల కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గుచ్చిమి గ్రామంలోని తోటలో మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారంనాడు కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి 500 మందికి పైగా ఆర్యవైశ్యులు పాల్గొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పలు రకాల పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు లక్కీబంపర్ డ్రా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. లక్కి బంపర్ డ్రాలో ఫ్యాను కుక్కర్ ఫోటో ఫ్రేములను ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతుల క్రింద అందజేశారు. దీంతోపాటు పెద్దఎత్తున బహుమతులను వివిధ రకాల పోటీలకు అందజేయడం జరిగిందని ఆర్యవైశ్య సంఘం నాయకులు మమ్ముల విశ్వేశ్వరరావు, ఆరిశెట్టి సత్యనారాయణ, ఆరిశెట్టి గోవిందరాజు, కూర్మదాసు లక్ష్మణరావు, కూర్మదాసు శ్రీనివాసరావు, పశుమూర్తి శ్రీనివాసరావు, కె త్రినాధ రావు,గ్రంధి శ్రీనివాసరావు, కూర్మదాసు వాసు, దేముడులు తెలిపారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలుసామాజిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు, వనమహెూత్సవ కార్యక్రమాలు ఎల్లప్పుడూ నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న ఆర్యవైశ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలాఉండగా మండలంలోని జోగమ్మపేట ఆదివారం కిటకిటలాడింది. అన్ని ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున యువతీ యువకులు ఉద్యోగులు విహారయాత్రకు తరలివచ్చారు.

శివాలయానికి వసతులు కల్పించండి

విశాలాంధ్ర-కూనవరం : హిందువులకు ముఖ్యంగా శివభక్తులకు కార్తీక మాసం విశిష్టమైనది. కూనవరంలోని శబరి గోదావరి సంగమ ప్రాంతంలో ఉన్న శివాలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తజనసంద్రంలా భక్తులు తరలివచ్చారు. కానీ స్త్రీలకు కనీస వసతులు కూడా అక్కడ లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డారు.అంత జనాధారణ విశిష్టత ఉన్న శివాలయానికి వెళ్లే దారి సరిగా లేదు. చేపల బజార్ మీదుగా డ్రైనేజీ పక్క నుచి రావడం వలన దుర్వాసన వస్తోంది అని భక్తులు అంటున్నారు. అలా కాకుండా నేరుగా శబరినదిఒడ్డున పాత అవేర్ హాస్పిటల్ ముందు ఉన్న సిమెంట్ రోడ్డు మీదగా నేరుగా శివాలయానికి గ్రావెల్ రోడ్డు వేస్తే భక్తులకు చాలా సౌకర్యంగా ఉంటుంది.శివాలయం చుట్టూ పశువులు ఆలయ ప్రాంగణంలోకి వచ్చి పేడ వేయడం మూత్రం పోయడం వంటివి జరగడా గుడి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. కార్తీక మాసం సందర్భంగా నదిలో స్నానమాచరించిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేయాలి. ఎంతో భక్తిశ్రద్ధలతో శివాలయానికి వచ్చే భక్తులు కనీస వసతులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత అధికారులు, ఆలయ కమిటీ దీనిపై చర్చించి భక్తులకు వసతులు కల్పించాలని కోరుతున్నారు.

వాహనాల తనిఖీలు

విశాలాంధ్ర-వై.రామవరం : మండలం లో చవి టి దిబ్బలు గ్రామం లో ఆదివారం ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. వాహన రికార్డులు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహన నిబంధనలను అనుసరించాలని సూచించారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర-వై.రామవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ, ఆశ్రమ, జడ్పీ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు... పట్టించుకోని అధికారుల తీరు

- రోజుకో కొత్త దుకాణం ఏర్పాటు
- పేరుకే కిరాణా షాపు.... అమ్మేది మద్యం

విశాలాంధ్ర-ఎటపాక : మండల పరిధిలో ఉన్న పల్లెల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతుంది. గ్రామాలు రాత్రింబవులు మత్తులో జోగుతున్నాయి. అనేకమంది మద్యం కనుగోలు చేసి పొద్దంతా పనిచేసిన డబ్బులు గుల్ల చేసుకుంటున్నారు. అదేవిధంగా అప్పులు చేసి మరి తాగడం వల్లన కాపురాలు, సైతం వీధి పాలవుతున్నాయి. మండల పరిధిలోని రాత్రి సమయంలో ఏ గ్రామంలో అయినా మధ్యరాత్రి అయినా బెల్ట్‌షాప్ తలుపుతడితే చాలు ఎటిఎం, లా కావాల్సిన మద్యం ప్రత్యక్షమవుతుంది. ధర ఎంతైనా పర్వలేదు అన్నట్లు మండలంలో మద్యం ప్రియులు వ్యవహారం ఉంది. ఏది ఏమైనా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వాకంతో ప్రధానంగా యువత పెడ దారిలో పయనిస్తుంది. ఎంతో విలువైన తమ భవిష్యత్తును యువత అబాసుపాలు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే మండలంలో ఎక్కువమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్య వ్యాపారం చేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతుందని చెప్పవచ్చు. పల్లెలు పట్టణాలు అనే తేడా లేకుండా మద్యం ఏరులై పారుతున్న ఎక్సైజ్ అధికారులు మాత్రం అడపాదడపా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగేందుకు బుక్కెడు నీరు దొరకని గ్రామాలు ఉన్నాయి కానీ, మందు దొరకని గ్రామాలు మాత్రం లేవని చెప్పవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్టు షాపులు మూసివేత దిశగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజల కోరుతున్నారు.